
# కలెక్టరేట్ ఛాంబర్ లో టీబీ ముక్త్ భారత్ అభియాన్ పై వీడియో కాన్ఫరెన్స్



**కొత్తగూడెం కలెక్టరేట్, జులై 3, ప్రజాజ్యోతి:** కొత్తగూడెం కలెక్టరేట్ ఛాంబర్ లో టీబీ ముక్త్ భారత్ అభియాన్ పై గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సెషన్ కు జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ ఎస్. జయలక్ష్మి , జిల్లా టీబీ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ బి. పుల్లా రెడ్డి లు పాల్గొన్నారు. ఈ సమావేశంలో కేంద్ర టీబీ విభాగం అదనపు కార్యదర్శి , జాతీయ ఆరోగ్య మిషన్ ఎన్ హెచ్ ఎం మేనేజింగ్ డైరెక్టర్ మాట్లాడారు, క్షయవ్యాధి యొక్క 10 క్లాసికల్ లక్షణాల కోసం దుర్బల జనాభా , అధిక-ప్రమాద సమూహాలను గుర్తించి పరీక్షించాల్సిన అవసరాన్ని చెబుతూ కీలక ఆదేశాలు జారీ చేశారు. టీబీని నిర్మూలించడానికి భారత ప్రభుత్వం యొక్క నిబద్ధతను అదనపు కార్యదర్శి పునరుద్ఘాటించారు, 2025 చివరి నాటికి టీబీ ముక్త్ భారత్ సాధించడానికి అన్ని జిల్లాలు చురుకుగా సహకరించాలని కోరారు.


జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



## భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం | 4 | జులై | 2025 ◆ పేజీలు : 5






## ఎస్.ఎల్.ఐ.ఎస్.

# భారం భద్రాద్రికి... ఫలాలు ఖమ్మానికి...

2 లో..

కనబడలేదా.. గోదారి తల్లి కడుపుకోత. వినబడలేదా.. గోదారి నీళ్ల రక్త గోష. గుండె నిండ పాలున్న బిడ్డలకు అందించలేని తల్లి బతుకు దేనికని. ఈ పాట గుర్తుంది కదా.. ఓ సినిమాలో ఆ ప్రాంతం నుండే నీళ్ళు పుష్కలంగా ప్రవహిస్తూ.. రైతులకు ఉపయోగా పడకుండా పోతున్ననే అన్న ఆవేదనలో ఆ గోదావరి తల్లి మనోవేదన తాలుకు సాహిత్య వర్ణన ఇది. ఆ నేపథ్యానికి అనుగుణంగా సుద్దాల అశోక్ తేజ దీనిని చక్కగా రచించారు. అయితే ప్రస్తుతం భద్రాద్రి కొత్తగూడెం నుండి ప్రవహిస్తున్న గోదావరి తల్లి ఆవేదన కూడా ఇదే.

◆ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి

● గోదావరి జలాల ఫలాలు ఎవరికీ..? ● జిల్లా గుండా ప్రవహిస్తున్న ప్రయోజనం కొంతే .. ● సీతారామ తోనైన మారుతయనుకున్న బతుకులు కానీ .. అడ్డుపడ్డ గద్దలు ● భారీ ప్రాజెక్ట్ తలపెట్టిన .. ఒక ఎకరాకు నీళ్లు అందని వైనం ● మంత్రుల తీరుతో భద్రాద్రికి జరిగిన అన్యాయం ● ఎస్ ఎల్ ఐ ఎస్ ప్రాజెక్ట్ లోపాయకార ఒప్పందం పై ప్రజాజ్యోతి వరుస కథనాలు..

## నన్నపనేని స్కూల్ కు

# సలామ్..!






- కార్పొరేట్ కు దీటుగా నిల'బడి'న వైనం
- సత్ఫలితాలనిచ్చిన 'బడిబాట' కార్యక్రమం
- నన్నపనేని లో పెరుగుతున్న ప్రవేశాలు
- టీచర్ల ప్రత్యేక కృషితో నన్నపనేని లో చేరేందుకు విద్యార్థుల మొగ్గు

2 లో..

## నిరుపేద మోమున

# ఆనందం చూస్తున్నాం...

- సొంతింటి కలను నెరవేర్చే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే
- అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు అందిస్తాం... ఎమ్మెల్యే జారే ఆదినారాయణ



2 లో...

## నిరుపేద మోమున ఆనందం చూస్తున్నాం




**అశ్వారావుపేట, జూలై 03, ప్రజాజ్యోతి:** ఇందిరమ్మ ఇంటి పట్టాలు అందుకుంటున్న ప్రజల మొహాల్లో ఆనందం చూస్తున్నామని అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు అందించే బాధ్యత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని దేనిని అశ్వారావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ అన్నారు. గురువారం నియోజకవర్గ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇందిరమ్మ ఇంటి పట్టాలను, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రతి నిరుపేదపు 5 లక్షలతో ఇంటి నిర్మాణం చేపడుతున్నామని అందులో భాగంగా నేడు రూ. 6.75 కోట్లతో 125మందికి పట్టాలను పంపిణీ చేశామన్నారు. కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ లబ్ధిదారులకు సుమారు రూ.92.10లక్షలు, ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి 14 మంది లబ్ధిదారులకు రూ. 4.80 లక్షలు అందించామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాన్ని అందించే బాధ్యత నాదేనని ప్రతి పేదవాడి ఆశలకు అనుగుణంగా పని చేస్తానన్నారు. సంక్షేమ పథకాల అమలులో ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని అధికారులతో మాట్లాడి వెంటనే సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నాగరాజు, తహసిల్దార్ రామకృష్ణ, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకులు జూపల్లి రమేష్ ,మండల అధ్యక్షుడు తుమ్మ రాంబాబు, సీనియర్ నాయకులు చెన్నకేశవరావు, జూపల్లి ప్రమోద్, రేమల్ల కేదార్నాథ్, మిండా హరిబాబు, అల్లాడి రామారావు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ ఎల్ ఐఎస్ భారం భద్రాద్రికి.. ఫలాలు ఖమ్మానికి..

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, జూన్ 3, (ప్రజా జ్యోతి):** కనబడలేదా.. గోదారి తల్లి కడుపుకోత. వినబడలేదా.. గోదారి నీళ్ల రక్త గోష. గుండె నిండ పాలున్న బిడ్డలకు అందించలేని తల్లి బతుకు దేనికని. ఈ పాట గుర్తుంది కదా.. ఓ సినిమాలో ఆ ప్రాంతం నుండే నీళ్ళు పుష్కలంగా ప్రవహిస్తూ.. రైతులకు ఉపయోగా పడకుండా పోతున్ననే అన్న ఆవేదనలో ఆ గోదావరి తల్లి మనోవేదన తాలుకు సాహిత్య వర్ణన ఇది. ఆ నేపథ్యనికి అనుగుణంగా సుద్దాల అశోక్ తేజ దీనిని చక్కగా రచించారు. అయితే ప్రస్తుతం భద్రాద్రి కొత్తగూడెం నుండి ప్రవహిస్తున్న గోదావరి తల్లి ఆవేదన కూడా ఇదే. మహారాష్ట్రలో మొదలైన గోదవరి కొన్ని ప్రాంతాల గుండా ప్రవహించి మన జిల్లాలో చర్ల, దుమ్ముగూడెం తీరాల వెంబడి పరవళ్ళు తొక్కుతు పవిత్ర భద్రాచలం మీదుగా ఆంధ్రప్రదేష్ లో కలుస్తుంది. మొత్తంగా 80 కిలో మీటర్ల మేర నిండు కుండల మన జిల్లాలోనే ఈ నది ప్రవహిస్తున్న.. ఫలాలు మాత్రం ఖమ్మం అనుభవిస్తుంది. రాష్ట్రంలో గద్దె ఎక్కుతున్న నాయకుల నిర్లక్ష్యం, ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని మంత్రుల ఆధిపత్యం కలగలిపి గిరిజన జిల్లాకు ఈ దుస్థితి ఏర్పడింది . దీనికితోడు భద్రాద్రి జిల్లాలోని నాయకుల చేత కానితనం ఇప్పుడు, ఎప్పుడు ప్రజలకు ఓ శాపంగా మారుతోంది.

### సాగర్ నిళ్ళు పుష్కలంగా ఉన్న..

తెలంగాణలో కాళేశ్వరం ప్రాజెక్టు తర్వాత రెండో అతిపెద్ద ప్రాజెక్టుగా మన జిల్లాలోని సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ (ఎస్ ఎల్ ఐఎస్) గుర్తింపు పొందింది. 11 యేళ్ల క్రితం కేసీఆర్ దీనికి శంకుస్థాపన చేశారు.



గోదావ రి నుంచి 67 టీఎంసీల నీటిని ఎత్తిపోయ డంద్వారా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల్లో సుమారు 8 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనేదే సంకల్పం. అయితే అప్పటి, ఇప్పటి ఖమ్మం జిల్లా మంత్రులు.. రాష్ట్ర నాయకులతో కుమ్మకై డిజైన్లను, డీపీఆర్ లను మార్చి, ప్రజలను ఏమార్చి ప్రాజెక్టు లక్ష్యానికి విరుద్ధంగా భద్రాద్రి నీటిని ఖమ్మం తరలించుకు పోతున్నారు. గోదావరి జలాల వరద నీరు ఉద్రిక్తత వల్ల జరిగే నష్టం, ప్రాజెక్టు నిర్మాణానికి కావలసిన భూమిని భద్రాద్రి జిల్లా ప్రజలు కోల్పోతుంటే.. ఖమ్మం మాత్రం ప్రతి ఎకరాకు పుష్కలంగా నీరు అందించుకుంటూ సస్యశ్యామలమవుతోంది. ఇప్పటికే నాగార్జునసాగర్ ప్రాజెక్టు (ఎన్ ఎస్ పి) ఎడమ కాలువ ద్వారా ఖమ్మం జిల్లాలో దాదాపు 3 లక్షల ఎకరాలకు సాగు నీరు అందుతోంది. సూర్యాపేట నుంచి పాలేరు వరకు జోన్ –1లో 50 వేల ఎకరాలు, పాలేరు నుంచి కల్లూరు వరకు జోన్ –2లో 2.50 లక్షల ఎకరాలకు రెండు పంటలకు నీరు పుష్కలంగా ఉంది. ఇదంతా కృష్ణా బేసిన్ పరిధిలోకి వస్తుంది. సాగర్ నీరుతో ప్రస్తుత ఖమ్మం జిల్లాలో 70శాతం భూములు సస్య శ్యామలంగా మారాయి. కానీ చెంతనే ఉన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గోదావరి బేసిన్ లో ఉండటంతో సాగర్ నీరు అందే అవకాశం మనకు లేకుండా పోయింది. దిన్ని గ్రహించిన అప్పటి వైఎస్ ప్రభుత్వం గోదావరి జలాలపై దృష్టి పెట్టింది. సాగర్ యేతర ఆయకట్టుకు సాగునీరు అందించడానికి దుమ్ముగూడెం వద్ద రాజీవ్ సాగర్, రుద్రంకోట వద్ద ఇందిరాసాగర్ ప్రాజెక్టులకు రూపకల్పన చేశారు. మొత్తం 4 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనేది అప్పుడు లక్ష్యంగా పెట్టుకొని ముందుకు సాగారు.

### రాష్ట్ర విభజనతో మరో ప్రణాళిక ..

అయితే ఆ తర్వాత రాష్ట్ర విభజన జరిగి తెలంగాణ ఏర్పడగా, అదే క్రమంలో ఉమ్మడి ఖమ్మంలోని ఏడు మండలాలు ఏపీలోని పూర్వ పశ్చిమగోదావరి జిల్లాలో కలిసిపోయాయి. ఇందిరాసాగర్ తలపెట్టిన ప్రాంతం విలీన మండలాల్లో ఉండటంతో రాజీవ్ సాగర్, ఇందిరాసాగర్ ప్రాజెక్టులను కలిపి, కొత్త ప్రాజెక్టుగా ప్రణాళిక చేసి 'సీతారామ ఎత్తిపోతల పథకం'గా కేసీఆర్ ప్రభుత్వం తెర మీద కు తీసుకువ చ్చింది. దీని ద్వారా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల్లో 4,15,621 ఎకరాలకు సాగునీరు అందించడం, మరో 3,89,366 ఎకరాలను స్థిరీకరించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. అప్పుడు రూ.7,926 కోట్ల అంచనా వ్యయంతో (ఇప్పుడు రూ.20 వేల కోట్ల కు పెరిగింది) పరిపాలన అనుమతి ఇచ్చి కేసీఆర్ 2016 ఫిబ్రవరి 16న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధిలోని టేకులపల్లి మండలం రోళ్లపాడు చెరువు వద్ద శంకుస్థాపన చేశారు. దీనికితోడు దుమ్ముగూడెం వద్ద గోదావరి నదిపై కాటన్ నిర్మించిన ఆనకట్టకు దిగువన 67 టీఎంసీల సామర్థ్యంతో సీతమ్మసాగర్ బ్యారేజిని ఏర్పాటు చేసి సీతారామ ప్రాజెక్టు ద్వారా నీరు పంపింగ్ చేసేలా మరో కాళేశ్వరం స్థాయిలో ప్రాజెక్టును డిజైన్ చేశారు. గోదావరి నుంచి నీటిని లిఫ్ట్ చేసి రోళ్లపాడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ద్వారా ఫేజ్–1 కింద భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల పరిధిలో కొత్త ఆయకట్టుకు సాగునీరు అందించి, ఆ తర్వాత ఫేజ్–2 కింద ఖమ్మం జిల్లా పరిధిలోని సాగర్ ఆయకట్టును స్థిరీకరణ చేయాడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే గిరిజన జిల్లాలోని ప్రతి ఎకరాకు నీరు అందించి .. సస్యశ్యామలం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగిన ఇంత భారీ ప్రణాళికకు ఉన్నటుండి ఏమైంది ..? పనులు ప్రారంభమై సుమారు 11 యేళ్ళు గడుస్తున్న భద్రాద్రి జిల్లాలో కనీసం ఒక్క ఎకరాకు కూడా నీరెందుకు అందలేదు ..? దిని వెనుకల ఉన్న మతలబు ఏంటి ...? తదుపరి సంచికలో

## నన్నపనేని స్కూల్ కు సలామ్..!





**భద్రాచలం ,జూలై 3,ప్రజాజ్యోతి :** నన్నపనేని హై స్కూల్ లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పుస్తకాలు,నోట్ బుక్స్ , యూనిఫాం, మధ్యాహ్న భోజనం తో విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. గత ఏడాదికి ఈ విద్యా సంవత్సరానికి నన్నపనేని హై స్కూల్లో విద్యార్థులు చదువుకోవడానికి మక్కువ చూపుతున్నారు.భద్రాచలం పట్టణంలోని నన్నపనేని హై స్కూల్ లో చదువుతో పాటు సంస్కారం, ఫిజికల్ ఎడ్యుకేషన్ అందిస్తున్నారు ఉపాధ్యాయులు. ప్రైవేటు పాఠశాలలకు పోటీగా వేసవి సెలవుల్లో కూడ బడి బాట కార్యక్రమంతో నన్నపనేని హై స్కూల్ ఉపాధ్యాయులు అడ్మిషన్ల కోసం గడపగడపకూ తిరుగుతూ నన్నపనేని హై స్కూల్ లో విద్యార్థులను చేర్పించేందుకు టార్గెట్ గా పెట్టుకొని విద్యార్థుల సంఖ్య పెంచారు.

### ప్రభుత్వ పాఠశాలల వైపే మొగ్గు

ఈ విద్యా సంవత్సరం నుంచి రాష్ట్ర ప్రభుత్వం సర్కార్ బడుల్లో నాణ్యమైన విద్యను అందించేందుకు శ్రీకారం చుట్టింది . దీంతో పాటు బుక్స్ , నోటుబుక్స్ పంపిణీకి శ్రీకారం చుట్టింది. గతంలో పాఠ్యపుస్తకాలు మాత్రమే ఉచితంగా పంపిణీ చేసేది. కానీ ఈ విద్యా సంవత్సరం నుంచి నోటు బుక్స్ కూడ ఉచితంగా అందిస్తోంది. పలు స్వచ్ఛంద సంస్థలు కూడ బ్యాగులు, పెన్నులు, పెన్సిళ్లు, ఇతర సామగ్రి ఉచితంగా అందిస్తున్నాయి. దీంతో విద్యార్థుల తల్లి దండ్రులు ప్రైవేటు పాఠశాలల ఫీజుల భారం మోయలేక ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పిస్తున్నారు.గతంలో మాదిరి ఉచిత యూనిఫాం, మధ్యాహ్న భోజనం ఉంటుంది. దూర ప్రాంత విద్యార్థులకు నెలకు రూ.600 రవాణా భత్యం కూడ చెల్లిస్తుంది. గతంతో పోలిస్తే ఈ విద్యా సంవత్సరం నన్నపనేని హై స్కూల్ లో సుమారు 270 వరకు విద్యార్థులు చదువుతున్నారు. గత ఏడాది 200లోపే విద్యార్థుల సంఖ్య ఉండేది.

### చదువుతో పాటు సంస్కారం

భద్రాచలం లోని నన్నపనేని హైస్కూల్ లో 270 మంది విద్యార్థులు ఉన్నారు. 24 ఉపాధ్యాయులు ఉన్నారు. ఇక్కడ చదువుకోవడానికి భద్రాచలం పట్టణంలోని పలు కాలనీ లోని విద్యార్థులు వస్తున్నారు. హెడ్ మాస్టర్ రేసు వెంకటేశ్వర్లు తోటి ఉపాధ్యాయులతో కలిసి చదువుతో పాటు విద్యార్థులు తల్లితండ్రులతో ఎలా మెలగాలి,పెద్ద వారి తో ఎలా మాట్లాడాలో విద్యార్థులకు నేర్పిస్తూ ,మధ్యాహ్న భోజన సమయంలో భోజన మంత్రాలతో పాటు , విద్యార్థులకు క్రీడలు, మానసిక ధృఢత్వంపై ప్రత్యేక క్లాసులు నిర్వహిస్తున్నారు. ఈ పాఠశాల ఉపాధ్యాయులు వేసవి సెలవు ల్లో విద్యార్థులను సర్కారు బడిలో చేర్పించేందుకు ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేసి విద్యార్థుల సంఖ్యను గణనీయంగా పెంచారు.

## నన్నపనేని లో నాణ్యమైన విద్య

**రేసు వెంకటేశ్వర్లు ,హెడ్ మాస్టర్**
**నన్నపనేని హై స్కూల్**

నన్నపనేని లో నాణ్యమైన విద్యను అందిస్తున్నాం. ఈ విద్యా సంవత్సరం నుంచి పాఠ్య పుస్తకాలతో పాటు నోటు బుక్స్ కూడ ప్రభుత్వం ఉచితంగా అందిస్తుంది. చదువుతో పాటు విద్యార్థులకు సంస్కారం నేర్పుతూ భవిష్యత్లో వారు నిలదొక్కుకునేలా మోటివేషన్ క్లాసులు కూడ నేర్పిస్తున్నాం. ఈ ఏడాది నన్నపనేని పాఠశాల లో విద్యార్థుల సంఖ్య పెరిగింది. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యాబోధన చేస్తూ విద్యార్థులను తీర్చిదిద్దుతున్నాం.



# అనుహ్యంగా చంద్రబాబు జపం

**ఇల్లందు, జులై 3, ప్రజాజ్యోతి:** రాష్ట్రం విడిపోయి 12 సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ చంద్రబాబు నాయుడు బూచిగా చూపిస్తూ టిఆర్ఎస్ పార్టీ తమ రాజకీయ కార్యకలాపాలను కొనసాగిస్తుందని టీడీపీ ఇల్లందు నియోజకవర్గ కన్వీనర్ ముద్రగడ వంశీ అన్నారు. గురువారం స్థానిక టిడిపి కార్యాలయంలో జరిగిన సమావేశంలో ముద్రగడ వంశీ మాట్లాడుతూ టిడిపి జాతీయ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై బనకచర్ల పేరుతో బిఆర్ఎస్ బురదజల్లే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. తెలుగు రాష్ట్రాలు పోటీపడి అభివృద్ధి చెందాలని తెలుగు ప్రజలు నెంబర్ వన్ పొజిషన్ లో ఉండాలని ఆశిస్తున్న చంద్రబాబుపై ఇలాంటివి వ్యాఖ్యలు చేసి రాజకీయ పబ్బం గడుపుకోవడం బాధాకరమన్నారు. బనకచర్ల విషయంలో అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో 2016 మినిట్స్ లో ఆనాడు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రాయలసీమని రత్నాల సీమగా మార్చేందుకు గోదావరి జిల్లాలను ఉపయోగించుకోవాలని, ప్రతి సంవత్సరం 3000 టీఎంసీలు వృధాగా పోతున్నాయని దాన్ని వడిచిపెట్టుకొని రాయలసీమను అభివృద్ధి చేసుకోవాలని కెసిఆర్ మాటలు హరీష్ రావుకి ఎందుకు గుర్తు రావటం లేదని గుర్తు చేశారు. వీటిపై సమాధానం చెప్పలేని టిఆర్ఎస్ పార్టీ కేవలం చంద్రబాబునాయుడు,రేవంత్ రెడ్డిలను బూచిలుగా చూపిస్తూ ఇక్కడ తమ రాజకీయ ఎదగాలని కోరుకోవడం సూచనీయమని పేర్కొన్నారు. టిఆర్ఎస్ లో జరుగుతున్న ఇంటిపోరును తట్టుకోలేక హరీష్ రావు బనకచర్లపై, కవిత బీసీలపై, కేటీఆర్ హైదరాబాద్ పై ప్రేమను చూపిస్తూ వివిధ అంశాలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. బిఆర్ఎస్ కు నిజంగా తెలంగాణపై చిత్తశుద్ధి ఉంటే కాంగ్రెస్ చేపడుతున్న అనేక కార్యక్రమాలపై వారిలో తమ సలహాలు సూచన ఇచ్చి తెలంగాణ అభివృద్ధికి తోడ్పాటు అందించాలే తప్ప అధికారం కోల్పోయామని ఇలాంటి పిచ్చి ప్రేమలు చేయడం తగదని సూచించారు. తెలంగాణలో ఏం జరుగుతున్న అది చంద్రబాబు నాయుడు వల్లే అని చెప్పడం బాధాకరమన్నారు. బిజెపి నూతన అధ్యక్షుడిగా రాంచందర్ రావును నియమిస్తే అందుకు కారణం చంద్రబాబు అని అంటున్నారని, బిఆర్ఎస్ నాయకులు, మరికొందరు బీజేపీలో అధ్యక్ష పదవి ఆశించి రాని వారు చంద్రబాబు కారణం అంటున్నారని పేర్కొన్నారు. కూటమి బాధ్యత మరిచి ఇక్కడ చంద్రబాబు కేం పని అంటున్నారని, మరొక కాంగ్రెస్ జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి తెలంగాణలో టిడిపి కోవర్టులు ఉన్నారని, వాళ్లందరికీ కరెంటు కలెక్షన్లు, నల్ల కలెక్షన్లు, తీసివేయాలని మాట్లాడడం ఏమిటని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి ఒక మాట అంటే వారి ఎమ్మెల్యేలు ఇంకో మాట అనడం ఏమిటని ప్రశ్నించారు. తెలంగాణలో ఉన్న టిఆర్ఎస్ నాయకులు,ప్రతిపక్షంలో హుందాగా ఉండి ప్రత్యర్థ పార్టీలు కాంగ్రెస్, బిజెపి లపై పోరాటం చేయాలని, అలా కాకుండా రేవంత్ రెడ్డిని టార్గెట్ చేస్తూ చంద్రబాబు శిష్యుడు అని పదేపదే జపం చేస్తున్నారన్నారు. హైదరాబాద్ నడిబొడ్డున ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్ లో పుట్టిన పార్టీ తెలుగుదేశం పార్టీ ప్రజాస్వామ్యంలో ఎక్కడన్నా పోటీ చేయొచ్చని, టిడిపి ఆంధ్ర పార్టీ అన్నారని, కాంగ్రెస్, బిజెపి లలో ఆంధ్ర పార్టీ వాళ్లు లేరా అని ప్రశ్నించారు. కెసిఆర్, టిఆర్ఎస్ నాయకులకు చంద్రబాబును చూస్తే భయమేస్తుందని. ఈ మధ్యకాలంలో తరచుగా కెసిఆర్, కేటీఆర్, కవిత, హరీష్ రావు, జగదీష్ రెడ్డి లతో పాటు మరి కొందరు బిఆర్ఎస్ నాయకులకు.... చంద్రబాబును తలుచుకొనిదే రాజకీయ పబ్బం గడిచే పరిస్థితి లేదన్నారు. టిడిపి ఒక కర్మగారమని, బిజెపి, బిఆర్ఎస్ లోనూ టీడీపీ పార్టీ నాయకులు ఉన్నారని గుర్తు చేశారు. మరొసారి చంద్రబాబు, టీడీపీ పార్టీపై అనవసరమైన మాటలు జారితే తగిన రీతిలో బుద్ధి చెప్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు రమేష్ బాబు, టిడిపి పట్టణ అధ్యక్షులు పాలమాలు బాలకృష్ణ, కార్యదర్శి దేశావత్ శ్రీహరి, నాయకులు అయ్యోరి నాగరాజు, కంది రవి, శ్యామ్ తీవారి, కారు నరసన్న, దేవరకొండ నవీన్, రాజేష్ తదిరులు పాల్గొన్నారు.




## పాల్వంచ మార్కెట్ లో 15 కిలోల కిన్నెరసాని చేప



**పాల్వంచ(టౌన్ )జులై 3(ప్రజాజ్యోతి):** పాల్వంచ మార్కెట్ లో గురువారం ఉదయం నుంచే సందడిగా మారింది. ఎప్పటిలా కాకుండ. ఈరోజు ఓ అరుదైన దృశ్యం ప్రజల దృష్టిని ఆకర్శించింది కిన్నెరసాని నది నుంచి పట్టుకున్న ఏకంగా 25. కిలోల భారీ చేప ఒకటి మార్కెట్ కు అమ్మకానికి వచ్చింది సాధారణంగా ఇంత పెద్ద చేపలు మార్కెట్ లో కనిపించడం చాలా అరుదు. ఈ భారీ చేపను చూసేందుకు చుట్టు పక్కల ప్రాంతల నుంచే కాకుండ, కాస్త దూరం నుంచి ప్రజలు తరలివాచ్చారు. కొందరు ఆశ్చర్యంగా చూస్తుంటే మరికొందరు తమ సెలఫోన్ లో ఫోటోలు, వీడియోలు తీశారు.

## జూన్లో 2.43 లక్షల మంది భక్తులకు రామయ్య దర్శనం

**భద్రాచలం, జూలై 3,ప్రజాజ్యోతి :** భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో స్వామివారిని 2,43,512 మంది భక్తులు ఒక్క నెలలోనే దర్శించుకున్నట్లు ఆలయ ఈవో రమాదేవి గురువారం తెలిపారు. జూన్ నెలలో స్వామివారిని భక్తులు దర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకున్నారు. అయితే గత ఏడాది 2,03,210 మంది భక్తులు దర్శించుకోగా ఈ ఏడాది జూన్లో రామయ్యను దర్శించుకున్న భక్తుల సంఖ్య 40వేల మందికి పెరిగిందని ఆలయ ఈవో తెలిపారు.

## గంగారం ఆశ్రమ పాఠశలలో వైద్య శిబిరం

- విద్యార్థులకు వ్యాధులు, చర్మవ్యాధులపై అవగాహన



**టేకులపల్లి,జూలై 03, ప్రజాజ్యోతి:** మండలంలోని సులానగర్ ప్రభుత్వ వైద్యాధికారి కందుల దినేష్ ఆధ్వర్యంలో గురువారం గంగారం ఆశ్రమ ఉన్నత పాఠశాలలో వైద్య శిబిరం నిర్వహించి అవసరమైన పిల్లలకు చికిత్స అందించడం జరిగింది. అనంతరం పిల్లలకు వ్యాధులపై అవగాహన కల్పించారు. పిల్లలు వ్యాధులకు దూరంగా ఉండాలంటే వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి అని వారు తెలిపారు. పిల్లలు ఉండేటటువంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం, చక్కటి పోషకాహారం తీసుకోవడం ఆరోగ్యకరమని అలాగే పిల్లలు ఆహారం తీసుకునే ముందు మరుగుదొడ్డి ఉపయోగించిన తర్వాత విధిగా చేతులు పరిశుభ్రంగా కడుక్కోవాలని వారు తెలిపారు. ప్రతిరోజు ఉదయం,సాయంత్రం రెండు పూటలా శుభ్రంగా నోటిని బ్రష్ చేసుకోవాలని అలాగే రెండు పూటలా స్నానం చేయాలని, వదులుగా ఉన్న బట్టలు ధరించాలని తడి బట్టలు ఉపయోగించరాదని పరిశుభ్రత లోపించడం వల్ల చర్మ సంబంధితమైన అంటు వ్యాధులు ఒకరి నుంచి ఒకరికి చాలా త్వరగా వ్యాపిస్తాయని తద్వారా నిద్ర లేకపోవడం వలన, పిల్లలు చదువుల్లో, ఆటల్లో వెనుకబడె అవకాశం ఉంటుంది కాబట్టి చక్కటి పరిశుభ్రమైన అలవాట్లు కలిగి ఉండాలని విద్యార్థులకు వారు సూచించారు.చర్మ సంబంధితమైన వ్యాధులు ఉన్న పిల్లల బట్టలు డెటాల్ లో ఉతికి బాగా ఎండకు ఎండిన తర్వాతనే ఉపయోగించాలని ఒకరు వాడిన బెడ్ షీట్స్, టవల్స్ బట్టలు ఎట్టి పరిస్థితుల్లో మరొకరు వాడరాదని పిల్లలకు వారు సూచించారు.ఈ కార్యక్రమంలో మొత్తం 56 మంది విద్యార్థులకు సికిల్ సెల్ ఎనీమియా నిర్ధారణ కొరకు స్క్రీనింగ్ పరీక్షలు కూడా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి దేవా, సూపర్వైజర్ పోరండ్ల శ్రీనివాస్ , మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు శైలజ, హారిక ,ధనసరి రాంబాబు, ప్రధానోపాధ్యాయులు జగన్, వార్డెన్ కిషన్ ఉపాధ్యాయ సిబ్బంది ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి



**బూర్గంపహాడ్, జూలై 3 (ప్రజా జ్యోతి ):** జూలై 9న జరపతలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎంబీ నర్సారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మండల పరిధిలోని సారపాక సీపీఎం కార్యాలయంలో అనసూర్య అధ్యక్షతన నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికుల ఎన్నో త్యాగాలు, పోరాటాల ఫలితంగా సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేస్తూ నాలుగు లేబర్ కోడ్లుగా తీసుకువచ్చి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికులకు తీరని అన్యాయం చేసిందని ఆరోపించారు. తక్షణమే లేబర్కోడ్లను ఉపసంహరించుకోవాలని అన్నిరంగాల కార్మిక సంఘాలు 9వ తేదీన దేశవ్యాప్తంగా తలపెట్టిన సార్వత్రిక సమ్మెకు అన్ని కార్మిక సంఘాలు, ప్రజలు హాజరై సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో భవన నిర్మాణ రంగ గౌరవ అధ్యక్షులు బత్తుల వెంకటేశ్వర్లు, సీఐటీయూ మండల కన్వీనర్ పాండవుల రామనాధం, సీఐటీయూ మండల కమిటీ సభ్యులు శ్రీను, కాంట్రాక్టు యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటరెడ్డి, పాషా తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక వెలికితీత, సరఫరాకు యంత్రాలకై దరఖాస్తుల ఆహ్వానం



**భద్రాచలం, జూలై 3,ప్రజాజ్యోతి :** భద్రాచలం పరిధిలోని గోదావరి నదిలో ఇసుక రీచ్ల నుంచి స్థానిక సొసైటీల ద్వారా ఇసుక వెలికి తీసి నిల్వ చేసే ప్రదేశానికి సరఫరా చేయడానికి, లారీల్లో నింపడానికి యంత్రాలు అద్దె చెల్లింపు పద్ధతిలో దరఖాస్తులు కోరుతున్నట్లు ఐటీడీఏ పీవో రాహుల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇసుక వెలికితీయడానికి, సరఫరా చేయడానికి రెండు ఎస్క్ వేటర్లు, నాలుగు టిప్పర్లు, రెండు డోజర్లు, రెండు వాటర్ స్ప్రింక్లర్లు అద్దె చెల్లింపు పద్ధతిలో అవసరమని, ఆసక్తి కలిగిన గిరిజన ఏజెన్సీలు ఐటీడీఏ భద్రాచలంతో ఎంపానెల్ చేసుకోవడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తు ఫారాలు ఐటీడీఏ కార్యాలయంలోని 23 రూమ్నంబర్లో ఈ నెల 4వ తేదీ నుంచి 10వ తేదీవరకు ఉదయం 11 గంటల నుంచి సాయత్రం 5 గంటల వరకు లభిస్తాయని, ఒక్కో ఫారం రుసుము రూ.10వేలకు లభిస్తుందని తెలిపారు. పూర్తిచేసిన దరఖాస్తు ఫారం, ఈఎండీ రూ.2లక్షలు ఐటీడీఏ పీవో పేరుతో తీసిన డీడీతో పాటు 18వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా ఐటీడీఏ భద్రాచలంలో సమర్పించాలని సూచించారు. పూర్తి వివరాలకు 93984479092 .కు సంప్రదించాలని కోరారు.

## ఇంటిగ్రేటెడ్ గైడెన్స్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

**భద్రాచలం, జూలై 3,ప్రజాజ్యోతి :** ఇంటిగ్రేటెడ్ గైడెన్స్ శిక్షణ ఇచ్చేందుకు హైదరాబాద్లోని రాజేంద్రనగర్ గిరిజన ఐఏఎస్ స్టడీ సర్కిల్ ద్వారా రెసిడెన్షియల్ పద్ధతిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ఐటీడీఏ పీవో రాహుల్ గురువారం తెలిపారు. తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖచే యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ నిర్వహించే సివిల్ సర్వీస్ పరీక్షలు – 2026 ఆర్థిక సంవత్సరం కోసం ఈ శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులను ఆబ్జెక్టివ్, టైప్, అప్టిట్యూడ్ పరీక్షతో ఎంపిక చేయడం జరుగుతుందని, దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల కుటుంబ వార్షికాదాయం రూ.3లక్షలకు మించకూడదన్నారు. అభ్యర్థులు http://studycircle.cgg.gov.inలో లాగిన్లై గత నెల 14 నుంచి ఆన్లైన్ ద్వారా రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్నారని, జూలై 4 శుక్రవారం వరకు ఎవరైనా అభ్యర్థులు ఆన్లైన్ చేసుకోకపోతే తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఆయన కోరారు. ఆన్లైన్ అప్లికేషన్, సూచనల కోసం http://twd.telangana.gov.in వెబ్సైట్లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పూర్తి వివరాలకు ఐటీడీఏ కార్యాలయంలో భవిత సెల్లో సంప్రదించాలని కోరారు.

## శ్రీసరస్వతి శిశుమందిరన్ను సందర్శించిన ట్రైనీ కలెక్టర్



**బూర్గంపహాడ్, జూలై 3 (ప్రజా జ్యోతి) :** మండల కేంద్రమైన బూర్గంపహాడ్ లో శ్రీ సరస్వతి శిశు మందిర్ ను ట్రైనీ కలెక్టర్ సౌరబశర్మ గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా శిశుమందిర్లో పిల్లలకు అందుతున్న సౌకర్యాల గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఐటీసీ సహకారంతో పాఠశాల భవనాన్ని నిర్మించడంతో పాటు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు. ఈ పాఠశాలలో 40 మంది విద్యార్థులు చదువుకోవడం పట్ల సౌరబ్ శర్మ ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. ఈ పాఠశాలలో ఎక్కువ సంఖ్యలో పిల్లలు చదువుకోవడం ఆనందంగా ఉందన్నారు. పిల్లలకు కనీస అవసరాలైన టాయిలెట్స్, బాత్రూమ్స్, ఇతర సౌకర్యాలపై నిర్వాహకులను ఆరాతీశారు. ఈ పాఠశాల అభివృద్ధికి ఐటీసీ పీఎస్పీడీ చేసిన కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఐటీసీ అడ్మిన్ మేనేజర్ చెంగల్రావు, ఐడీఓసీ ఇంజనీర్ రాజగోపాల్, బీఎంఎస్ ప్రధాన కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు, పాఠశాల కార్యదర్శి పొదిలి పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## స్త్రీలకు గర్భకోశ వ్యాధుల ఉచిత పరీక్షా శిబిరం



**భద్రాచలం, జూలై 3,ప్రజాజ్యోతి :**భద్రాచలం పట్టణంలోని చిన్నజీయర్ మఠంలో గురువారం స్త్రీలకు గర్భకోశ వ్యాధుల ఉచిత పరీక్షా శిబిరాన్ని నిర్వహించారు. వికాసతరంగిణి, లయన్స్ క్లబ్ సంయుక్తంగా ఈ క్యాంపు ఏర్పాటు చేయగా ముఖ్యఅతిధిగా పాల్గొన్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. చిన్నజీయర్ మఠం ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్రాల వ్యాప్తంగా 1481 శిబిరాలు నిర్వహించగా 1482వ శిబిరాన్ని భద్రాచలంలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు చెప్పడం అభినందనీయమన్నారు. గర్భకోశ వ్యాధి పరీక్షల కోసం మహిళలు పెద్దసంఖ్యలో తరలిరావడం జరిగిందన్నారు. 35 ఏళ్లు దాటిన ప్రతి మహిళ ఈ పరీక్ష చేయించుకోవడం వల్ల రాబోయే గర్భకోశ వ్యాధుల నుంచి కాపాడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు, వికాసతరంగిణి అధ్యక్షురాలు కమలకుమారి, చినజీయర్ మఠం అధ్యక్షులు వెంకటాచారి, వికాసతరంగిణి జిల్లా అధ్యక్షురాలు రోజా రమణి, గర్భకోశ వ్యాధి నిపుణులు మాధవి, జయభారతి, వికాసతరంగిణి చక్రవర్తి, లయన్స్ సెక్రటరీ సిద్ధారెడ్డి, హరిచంద్రనాయక్, చారుగుల్ల శ్రీనివాస్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## సరోజినీ వృద్ధాశ్రమంలో అన్నదానం



**భద్రాచలం టౌన్, జులై 3, (ప్రజాజ్యోతి ):** భద్రాచలం మానవ సేవ వాలంటీర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నడిపిస్తున్న సరోజినీ వృద్ధాశ్రమంలో చతిస్గడ్ రాష్ట్రం కుంట గ్రామానికి చెందిన గుడ్ల శ్రీకాంత్ రెడ్డి, జోష్ణ ల కుమారుడు గుడ్ల వీర విహాన్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు, ఈ సందర్భంగా వృద్ధాశ్రమంలో ఉన్న వృద్ధులందరికీ అన్నదాన కార్యక్రమం నిర్వహించి, మిత్రులందరికీ పండ్లు పంచి పెట్టినారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం విహాన్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా వృద్ధాశ్రమంలో వద్దు లందరికీ అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కొండపల్లి ఈ యువన్ శ్రీరామ్ , గుడ్ల రమ్య రెడ్డి, కొండపల్లి రాధిక పాల్గొన్నారు.

# వాగు అవతల వైకుంఠధామం

- శ్మశానవాటిక
- ప్రణాళికలు లేకుండా నిర్మాణం
- శవాలతో సాహసాలు, గ్రామ ప్రజల కష్టాలు తీరేది ఎప్పుడు.?



**టేకులపల్లి,జూలై03,ప్రజాజ్యోతి :** మండలంలోని కిష్టారం గ్రామంలో ఎవరైనా చనిపోతే వైకుంఠధామానికి తీసుకోవడానికి వాగు దాటాల్సిందే, వైకుంఠధామాన్ని నిర్మించడానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు గ్రామస్తులకు అదునుగా ఉందా లేదా అని సలహాలు సూచనలు తీసుకోకుండా ఖాళీ స్థలం ఉందని మునుముందు వచ్చే కష్టాలను ఆలోచించకుండా ఏడైతే ఏమి ఎవరితో మాకేమి నిర్మించేసి బిల్లు తీసుకుందాం. ఒక పని అనే విధం గా గత ప్రభుత్వంలో అధికారులు నడుచుకున్న రీతి, ఈ వైకుంఠధామం వెళ్ళ శవాలతో సాహసాలు చేస్తూ గ్రా మ ప్రజలు నానా తంటాలు పడుతున్నా రు. కర్మకాళీ ఊర్లో వ్యక్తి కాలం చేస్తే దహన సంస్కారాలు చేయాలంటే దయనీయ పరిస్థితితో వాగు దాటడా నికి ఎడ్లబండ్లు,ట్రాక్టర్ ఉపయోగిం చాల్సి వస్తుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్థానిక ఎమ్మెల్యే, కలెక్టర్, ఉన్నత అధికారులు చొరవ చూపించి దీనికి ఒక పరిష్కారం చూపించవలసిందిగా గ్రామస్తులు వేడుకుంటున్నారు.





## జిల్లాలోని వైద్య విధాన పరిషత్ ఆస్పత్రులపై కలెక్టర్ జితేష్ వి పాటిల్ సమీక్ష

- ఆసుపత్రులు సూపరింటెండెంట్లు, నర్సింగ్ సూపర్డెంట్లు, ఫార్మాసిస్టులతో ప్రత్యేక సమావేశం
- విష జ్వరాల నేపథ్యంలో వైద్య సిబ్బందికి పలు సూచనలు చేసిన జిల్లా కలెక్టర్





**కొత్తగూడెం కలెక్టరేట్, జులై 3, ప్రజా జ్యోతి :** జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న కారణంగా రాబోయే రోజుల్లో విష జ్వరాలు ప్రభలే అవకాశం ఉన్నందున ఆసు పత్రి సిబ్బంది పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలని గురువారం కలెక్టరేట్ లో జిల్లా లోని వివిధ ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులతో ఫార్మసిస్టులతో సమీక్ష సమావేశం నిర్వ హించారు ,ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని రకాల మందులు, రీఏజెం ట్లు, టెస్టింగ్ కిట్లు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండాలని ,వివిధ హోదాల్లో ఉన్న వైద్య సిబ్బంది సమయపాలన పాటించి 24 గంటలు అందుబాటులో ఉండాలని ఆయన సూచించారు .ఇప్పటికే అన్ని ఆసుపత్రులలో కావాల్సిన మందులు రీఏజెం ట్లు ,మౌలిక వసతులు, ఆధునిక యంత్రాలు ఏర్పాటు చేసిన క్రమంలో రాబోయే రోజుల్లో రోగు లను ఎటువంటి ఇబ్బంది లేకుండా పూర్తి స్థాయిలో సన్నద్ధం కావా లని సూచించారు. అదేవిధంగా ఆసుపత్రులలో ఎటువంటి చిన్న చిన్న సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకువస్తే వాటిని పరిశీలించి తగిన పరిష్కార ఏర్పాట్లు తాను చేస్తానని , అవసరమైన నిధులు మంజూరు కి ఏర్పాట్లు చేస్తానని తెలిపారు. ఆసుప త్రిలో ఇన్సులిన్, మలేరియా మందులు అందుబాటులో లేవని వాటి గురించి వైద్య సిబ్బంది జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురాగా రాష్ట్ర అధికారులతో మాట్లాడి వాటిని అందుబాటులోకి తీసుకొని రాడానికి ఏర్పాటుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు .ఈ సమీక్ష సమావేశంలో జిల్లా డిసిహెచ్ఎస్ డాక్టర్ రవిబాబు, వివిధ ఆసుపత్రుల సూపరింటెండెంట్లు,ఫార్మసిస్టులు ,నర్సింగ్ సూపరింటెండెంట్ లు ,శానిటేషన్ సూపర్వైజర్లు పాల్గొన్నారు.

## దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయండి

- అఖిలపక్ష కార్మిక సంఘాల పిలుపు



**మణుగూరు, జూలై 03, (ప్రజాజ్యోతి) :** ఈ నెల 9వ తేదీన జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని అఖిలపక్ష కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. ఏఐటీయూసీ మండల కార్యదర్శి గడ్డం వెంకటేశ్వర్లు అధ్యక్షతన గురువారం సిపిఐ కార్యలయంలో అఖిలపక్ష కార్మికుల సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు ఆర్.లక్ష్మీనారాయణ(ఏఐటీయూసీ), వెలగపల్లి జాన్ (ఐఎన్టీయుసి), ఆర్.మధుసూదన్ రెడ్డి (టీయూసీఐ) ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... జూలై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేసి కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్ ని వ్యతిరేకించాలని అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు.కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటినుండి కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేసే విధానాలు, కార్మిక వ్యతిరేక, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందన్నారు. ముందు తరాల కార్మిక వర్గం పోరాడి, రక్త తర్పణ చేసి 8 గంటల పని దినం, సమ్మె చేసే హక్కు, సంఘం పెట్టుకొనే హక్కు తదితర హక్కులతో పాటు అనేక చట్టాలను, సౌకర్యాలను సాధిస్తే వీటన్నింటినీ కాలరాసే కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్ ను తీసుకువచ్చింది మండిపడ్డారు. ఈ లేబర్ కోడ్స్ అమలైతే యాజమాన్యాల దయాదాక్షిన్యాల మీద ఆధారపడే కట్టు బానిసలుగా కార్మికవర్గం తయారయ్యే ప్రమాదం ఉందన్నారు. కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్ ను తిప్పికొట్టవలసిన బాధ్యత కార్మిక వర్గంపై ఉందన్నారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్ ను రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలని కనీస వేతనం రూ. 26 వేలు చేయాలని అంతేకాకుండా స్కిల్డ్ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని అన్నారు. అదేవిధంగా తదితర డిమాండ్ల సాధన కోసం కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల వివిధ ఫెడరేషన్ల సంస్థల ఆధ్వర్యంలో మే 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె జరుగుతుందని తెలిపారు. ఈ సమ్మెలో కార్మిక వర్గం పాల్గొని విజయవంతం చేసి కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్ ను, కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకించాలన్నారు.ఈ కార్యక్రమంలో అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు ఏఐటీయూసీ మండల అధ్యక్షులు రాయల బిక్షం, కోశాధికారి కొత్తపల్లి సీతారాములు, గౌరవ అధ్యక్షు లు బోశెట్టి సంపత్, ఐఎన్ టియు సి నాయకులు అయితనబోయిన సతీష్, జి. శ్రీనివాస్, సీతారాములు, ఎన్. నాగేశ్వరరావు,కార్మికులు, పాల్గొన్నారు.

# పశుసంవర్ధక శాఖా మండల స్థాయి పశువైద్యాధికారులు, జిల్లా వెటర్నరీ వైద్య సిబ్బందితో సమావేశం

**కొత్తగూడెం కలెక్టరేట్ జులై 3 ప్రజాజ్యోతి :**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ గురువారం తన కార్యాలయంలో జిల్లా పశువైద్య, పశు సంవర్ధక శాఖాధికారి, మండల స్థాయి పశువైద్యాధికారులు, జిల్లా వెటర్నరీ వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని గిరిజన గ్రామాలలో గిరిజనులు మహిళల వద్ద ఉన్న మేకల సంతతిని అభివృద్ధి చేసి అధిక పాల దిగుబడి సాధించే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మేకపాల విశిష్టతను ప్రజలకు తెలియజేయడానికి అవగాహన కార్యక్రమాలు నిర్వహిం



చి, మేకపాల నుండి పెరుగు, మజ్జిగ, జున్ను, పన్నీరు, చీజ్ వంటి ఉత్పత్తులను తయారు చేసి వినియోగించే పద్ధతులపై గిరిజనులు, మహిళలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని సూచించారు. అదేవిధంగా, మేకపాలను ప్రోత్సహించడం ద్వారా మేకలు అడవుల్లో లభించే ఆకులు, చెట్లు మేతగా తీసుకోవడం వలన అడవులను రక్షించవచ్చని, అడవులు మనలను రక్షిస్తాయని కలెక్టర్ తెలిపారు. మేకల మేత కోసం అవసరమైన మొక్కలను నాటడం ద్వారా అడవుల అభివృద్ధి జరగుతుందన్నారు. తద్వారా గిరిజనులు, మహిళలు, సమాజం మొత్తానికి లాభం చేకూరుతుందని వివరించారు. జిల్లా ప్రజలకు ఆరోగ్యకరమైన మేకపాలను అందించడానికి ప్రత్యేకంగా మేకపాల విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేయాలని, వీటి మార్కెటింగ్ ద్వారా గిరిజనులు, మహిళల ఆర్థిక స్థితి మెరుగుపడుతుందని కలెక్టర్ తెలిపారు. ఇకపై గిరిజనులు మహిళలను బాతులు, కౌజు పిట్టల పెంపకం పై కూడా ప్రోత్సహించడానికి తగిన ఏర్పాట్లు చేయాలని, ఈ చర్యల ద్వారా ఆదివాసీ కుటుంబాలు, మహిళలు ఆర్థికంగా లాభపడడమే కాకుండా ఆరోగ్యకరమైన ఆహారం పొందుతారని కలెక్టర్ అన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ ఎం. వెంకటేశ్వర్లు, జిల్లా పశువైద్య, పశుసంవర్ధక శాఖాధికారి, మండల స్థాయి పశువైద్యాధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# గిరిజన సంక్షేమ శాఖ క్రీడా పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు క్రీడలలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి

- ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్

**కొత్తగూడెం కలెక్టరేట్ జులై 3 ప్రజాజ్యోతి :** గిరిజన సంక్షేమ శాఖ క్రీడా పాఠశాలల్లో చదువుతున్న బాలురకు వివిధ క్రీడలలో నిష్ణాతులను చేసి జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రాణించడానికి ప్రత్యేక చర్యలు చేపట్టడంతో పాటు, వారికి ప్రత్యేకమైన మెనూ అందించడం జరుగుతుందని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు. గురువారం పాల్వంచ డివిజన్లోని కిన్నెరసాని క్రీడా పాఠశాలను ఆయన సందర్శించి పిడీలు, పి ఈ టి లు, కోచులు విద్యార్థులకు సాధన చేస్తున్న క్రీడలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడా పాఠశాలల్లో చదివే బాల బాలికలకు చక్కటి విద్యతో పాటు ప్రత్యేకమైన వారికి ఇష్టమైన క్రీడలలో తర్ఫీదు పొంది సాధన చేయడానికి నిష్ణాతులైన కోచులు పీడీలతో ప్రతిరోజు సాధన చేయించడం జరుగుతుందన్నారు. సంబంధిత పీడీలు, కోచులు విద్యార్థుల ఆట తీరును గమనించి, వాటికి సంబంధించిన మెలకువలను ఎప్పటికప్పుడు అందిస్తూ ఉండాలన్నారు. ప్రతి విద్యార్థి వారికి ఇష్టమైన క్రీడలలో ఆడే విధంగా చొరవ చూపాలని అన్నారు. సంబంధిత హెచ్ఎం, వార్డెన్ విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, వారికి సమయానుకూలంగా





ప్రత్యేకమైన మెనూ ప్రకారం భోజనము అందించాలని, ఉదయం సాయంత్రం తప్పనిసరిగా క్రీడలలో సాధన చేయించాలని అన్నారు. అనంతరం 12 లక్షల విలువ గల 240 మంది బాలురకు క్రీడా దుస్తులు అందించారు. ఈ కార్యక్రమంలో డిడి ట్రైబల్ వెల్ఫేర్ అధికారిని మణెమ్మ, స్పోర్ట్స్ ఆఫీసర్ గోపాలరావు, అసిస్టెంట్ స్పోర్ట్స్ ఆఫీసర్ వెంకట్ నారాయణ, కోచులు, పిడిలు, పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.

# ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జయలక్ష్మి





**ఆళ్ళపల్లి జులై3, ప్రజాజ్యోతి :**ఆళ్లపల్లి మండల కేంద్ర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జయలక్ష్మి .ఈ తనిఖీ లో భాగంగా ఆనంతోగు బాలికల ఆశ్రమ పాఠశాల.మర్కోడు ఆశ్రమ పాఠశాలలో జరుగుతున్న సికిల్ సెల్ పరీక్షలను పర్యవేక్షించడం జరిగింది. పిల్లలను ఉద్యేశించి సికిల్ సెల్ అనే రక్త హీనత వ్యాధి గురించి అవగాహనా కల్పించడం జరిగింది అలానే సీజనల్ వ్యాధుల గురించి మాట్లాడం జరిగింది .ఈ కార్యక్రమం లో హాస్పిటల్ సిబ్బంది డాక్టర్ సంఘమిత్ర. డాక్టర్ రేవంత్ సి హెచ్ ఓ సోమ్లా నాయక్ , ఎస్ యు ఓ.హరి కృష్ణ , హెల్త్ ఎడ్యుకేటర్ టీ. రమాదేవి , హెల్త్ అసిస్టెంట్ మంకిడి నరేష్, ఎం శ్రీధర్ బాబు, ఎంఎల్ హెచ్ పి రేవతి, ఏ ఎన్ ఎం ఎస్ సావిత్రి, రమణ. ఆశ వర్కర్స్ పాల్గొన్నారు.

# భద్రాద్రి రామయ్యకు నిత్యకల్యాణం



**భద్రాచలం, జూలై 3,ప్రజాజ్యోతి :**భద్రాచలం దివ్యక్షేత్రంలోని బేడా మండపంలో అర్చకులు గురువారం స్వామివారికి నిత్యకల్యాణం నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాతం పలికి ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్యబలిహరణం, నిత్యహోమాలు, నిత్య పూజలు జరిపారు. కల్యాణంలో పాల్గొన్న దాతలకు ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అన్నపురెడ్డిపల్లి మండలంలో సికిల్ సెల్ స్క్రీనింగ్ క్యాంప్



**అన్నపురెడ్డిపల్లి, జూలై 3,ప్రజా జ్యోతి :**అన్నపురెడ్డిపల్లి మండలంలోని పెంట్లం గ్రామపంచాయతీ పరిధిలోని నామవరం, కంపగూడెం, భాస్కరపురం గిరిజన పాఠశాలలలో ఈరోజు ప్రత్యేక సికిల్ సెల్ స్క్రీనింగ్ శిబిరం నిర్వహించారు. విద్యార్థుల రక్త నమూనాలను పరీక్షించి, ఎవరికి సికిల్ సెల్ వ్యాధి లేదని వైద్యులు నిర్ధారించారు.అదే విధంగా, గ్రామంలో నిర్వహించిన వైద్య శిబిరంలో స్థానికులకు అవసరమైన చికిత్సలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చెందిన వైద్యురాలు డాక్టర్ ప్రియాంక, మండల విద్యాధికారి ఆనంద్, పాఠశాల ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, హెల్త్ సూపర్వైజర్ ప్రకాశ్ రావు, హెల్త్ అసిస్టెంట్ కోటేశ్వరరావు, ఎంఎల్ హెచ్ పీ లావణ్య, ఆరోగ్య కార్యకర్త నాగజ్యోతి, ఆశా కార్యకర్తలు నాగమ్మ, శిరోమణి తదితరులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య పనులు చేపట్టాలి

**భద్రాచలం టౌన్, జులై 3(ప్రజాజ్యోతి) :**వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పట్టణ వ్యాప్తంగా పారిశుద్ధ్య పనులను వేగవంతంగా చేపట్టి ప్రజా ఆరోగ్యాన్ని కాపాడాలని సిపిఐ ఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం బి నర్సారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం సిపిఐఎం 13వ వార్డు కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఏఎంసీ కాలనీలో స్థానిక సమస్యలపై సర్వే నిర్వహించారు.ఎంసీ కాలనీలో పేరుకుపోయిన చెత్తాచెదారం సైడ్ డ్రైనేజీల సమస్యలపై స్థానికులు సిపిఐఎం బృందం దగ్గర తమ ఆవేదనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలను ఉద్దేశించి ఎంపీ నర్సారెడ్డి మాట్లాడుతూ పట్టణ వ్యాప్తంగా డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక రోడ్లపైకి మురుగునీరు చేరుతుందని అన్నారు. నివాస గృహాల మధ్య పిచ్చి చెట్లు పెరిగి అరణ్యాన్ని తలపిస్తూ విషపాములు పురుగులు సంచరిస్తున్నాయని. రోడ్ల మీదికి వచ్చి చేరుతున్న మురుగు నీటిలో దోమలు శరీర విహారం చేస్తూ డెంగ్యూ టైఫాయిడ్ మలేరియా వంటి విష జ్వరాలు వ్యాపించే ప్రమాదం స్పష్టంగా కనబడుతుందని అన్నారు. నూతనంగా నిర్మించిన డబుల్ బెడ్రూములలో సైతం సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఆ నీరు మొత్తం ఏఎంసి కాలనీకి వచ్చి చేరి స్థానిక ప్రజలు రోగాల బారిన పడుతున్నారని అన్నారు. పంచాయతీ అధికారులు పట్టణవ్యాప్తంగా పారిశుద్ధ్య పనులను వెంటనే చేపట్టాలని లేనిపక్షంలో సిపిఐఎం ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయం ముందు ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో యు జ్యోతి, అల్లాడి సత్యవతి, చిట్టిబాబు, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

